andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ జిల్లా వార్తలు

5

మంగళవారం 30 సెప్టెంబరు 2025





వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య

# మోగిన స్థానిక సంస్థల నగారా



- స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- జిల్లాలో రెండు విడతల్లో జిల్లాపరిషత్, మండల పరిషత్ ఎన్నికలు
- రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు
- అక్టోబరు 23, 27న పరిషత్ మొదటి విడత, రెండో విడత ఎన్నికలు
- అక్టోబర్ 31, నవంబరు 4న గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికలు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

**రెండు విడతల్లో ఎన్నికలు..**

| | మొదటి విడత | రెండో విడత |
|---|---|---|
| ఎంపీటీసీ స్థానాలు | 177 | 130 |
| జడ్పీటీసీ స్థానాలు | 18 | 13 |
| సర్పంచ్ | 281 | 264 |
| వార్డు మెంబర్ | 2,510 | 2,512 |

## ముగ్గురు పిల్లలుంటే పోటీకి అనర్హులే

స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలున్న వారు పోటీ చేసేందుకు అనర్హులేనని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 21 (3) స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారు అనర్హులు. 1994 తర్వాత మూడో సంతానం కలిగిన వారు అనర్హులని తేల్చారు. ఇటీవల పంచాయతీ రాజ్ చట్టంలో రిజర్వేషన్ల పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసినప్పటికీ సెక్షన్ 21 (3) మాత్రం సవరించలేదు. దీంతో ముగ్గురు పిల్లల నిబంధన యథాతథంగా ఉండనుంది.

## 'కోడ్' కూసింది

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈరోజు నుంచి ప్రభుత్వ పథకాల ప్రకటనలు, నిధుల కేటాయింపు వంటి వాటికి ఆంక్షలు ఉండనున్నాయి. రాజకీయ నాయకుల విగ్రహాలను కప్పి ఉంచడంతో పాటు పోస్టర్లను తొలగించనున్నారు.

"స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్ల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. జిల్లాలో రెండు విడతల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, వార్డు మెంబర్ల ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 23న మొదటి విడత, అక్టోబరు 27న రెండో విడత పోలింగ్‌ను నిర్వహించనున్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 31న మొదటి విడత, నవంబరు 4న రెండో విడత ఎన్నికలు నిర్వహించనున్నారు.

నిజామాబాద్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు విడతల్లో ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తుండగా ఆ తేదీల్లోనే జిల్లాలో కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. శనివారం జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, వార్డు మెంబర్ల స్థానాలకు రిజర్వేషన్లను ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో విడుదల చేయగా ఆ జీవో ఆధారంగా అధికారులు జిల్లాలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులకు రిజర్వేషన్లను ప్రకటించారు. రిజర్వేషన్లకు సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉండగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో గత కొద్ది కాలంగా స్థానిక సంస్థల ఎన్నికలపై ఉన్న అనుమానాలకు తెర దించినట్లయింది. దీంతో గ్రామాలలో రాజకీయ వాతావరణం నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న స్థానాలలో పోటీచేసేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**మొదటి విడత, రెండో విడత షెడ్యూల్ ఇదే..**



ప్రాదేశిక మొదటి విడత ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా 9వ తేదీ నుంచి అక్టోబరు 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అక్టోబరు 12వ తేదీ నామినేషన్ల పరిశీలన, అక్టోబరు 15వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ, అక్టోబరు 31న మొదటి విడత పోలింగ్ జరుగనుంది. రెండవ విడత ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 13న నోటిఫికేషన్ విడుదల కానుండగా 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నామినేషన్లను (మిగతా 8వ పేజీలో)

స్థానిక సంస్థల ఎన్నికలకు

# పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ ఇతర జిల్లాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు గ్రామపంచాయతీ ఎన్నికలను కూడా జిల్లాలో రెండు విడతలలో నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 545 గ్రామ పంచాయతీలకు తొలివిడతలో 281 జీపీలలో, రెండోవిడతలో 264 జీపీలలో ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించామని అన్నారు. మొత్తం 5,022 గ్రామ పంచాయతీ వార్డు స్థానాలకు మొదటి దఫాలో 2,510 వార్డులకు, రెండవ విడతలో 2,512 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో కట్టుదిట్టమైన నిఘాను కొనసాగిస్తామని అన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ నోడల్ అధికారులతో సమావేశం అయ్యారు. రాష్ట్ర ఎన్నికలకమిషన్ మార్గదర్శకాలను తూచాతప్పక పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీపీల ఎన్నికలు ఒకేసారి జరుగుతున్న దృష్ట్యా తప్పిదాలకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కేవలం 40 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను (మిగతా 8వ పేజీలో)





బాసరకు

## పోటెత్తిన భక్తులు

- మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయానికి తరలివచ్చిన భక్తజనం 7
- 1,883 మంది పిల్లలకు అక్షర శ్రీకార పూజలు



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార గంగారెడ్డి

## రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

ఆర్మూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని మార గంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,389, బీ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు 2,369 అందజేస్తున్నామన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరిక్రిష్ణ, ఏఈవో సవిత, సీఈవో శ్యాం, డైరెక్టర్లు ఆలూర్ నారాయణరెడ్డి, పుప్పాల ప్రవీణ్, నరేడ్ల గంగారాం, చిట్టెడి చిన్నయ్య, కుంట గంగారెడ్డి, మురళి, కల్లెం నర్సారెడ్డి పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

## భూపతిరెడ్డికి మాతృవియోగం



రేకులపల్లి లక్ష్మీ నర్సమ్మ

నిజామాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి మాతృవియోగం కలిగింది. ఎమ్మెల్యే మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీనర్సమ్మ (92) గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న అశోక అపార్ట్‌మెంట్‌లోని స్వగృహంలో ఆమె సోమవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఎమ్మెల్యే మాతృమూర్తి మరణవార్త విన్న ఆయన అనుచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. పలువురు నాయకులు ఎమ్మెల్యేను పరామర్శించారు. మంగళవారం నగర శివారులోని బైపాస్ రోడ్‌లోగల గూపన్‌పల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆకాశ దీపాలపై

## అలసత్వమేల ?

- మూన్నాళ్ల ముచ్చటైన హైమాస్ట్ వెలుగులు
- చీకటితో రహదారిపై ప్రజల పాట్లు



రుద్రూర్ చౌరస్తాలో వద్దగల దీపాలు

రుద్రూరు, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆకాశ దీపాలు (హైమాస్ట్ లైట్లు) అధికారుల, పాలకుల అలసత్వం మూలంగా నిరుపయోగంగా మారాయి. ఆకాశ దీపం లక్షలతో వెచ్చించి రుద్రూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. విద్యుత్ కాంతులు విరజిల్లే వేళ ఆర్భాటంగా ఏర్పాటు చేసిన వీటి వెలుగులు మున్నాళ్ల ముచ్చటగానే మారింది. కొన్ని ప్రమాదాలకు గురై దెబ్బతిన్న మరికొన్ని ఎందుకు పనికి రాకుండా అలంకరప్రాయంగా మారాయి. పంచాయతీలో కార్యదర్శుల పాలన నడవడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇటీవల రుద్రూర్ మండల కేంద్రంలోని గణపతి ఉత్సవాల్లో భాగంగా నాలుగు చిన్నలైట్లు పెట్టి వదిలేశారు. వీటి గురించి పట్టించుకోకపోవడంతో వీటి ఏర్పాటుకు వెచ్చించిన నిధులు నిరుపయోగంగా మారి ప్రభుత్వ ధనం వృథా అవుతుంది. రుద్రూర్ (మిగతా 8వ పేజీలో)



ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

## ఎస్సారెస్పీకి భారీగా వరద

- ప్రాజెక్టుకు 3.50 లక్షల ఇన్‌ఫ్లో
- 39 వరద గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణజిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఎస్ఈ జగదీష్ తెలిపారు. మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు అధికారులు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 3 లక్షల 50 వేల క్యూసెక్కుల వరద చేరుతుండటంతో ప్రాజెక్టు 39 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 3.09 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అలాగే ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల (మిగతా 8వ పేజీలో)

రిజర్వేషన్ల ఖరారుతో

## ఆశలు గల్లంతు

- రెండేళ్ల నుంచి ఎదురు చూస్తున్న నేతల నిరుత్సాహం
- అంచనాలు తలకిందులు
- బీసీ నేతల్లో ఆనందం

ఆర్మూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల స్థానాలు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆర్మూర్ డివిజన్‌లో నాయకుల అంచనాలు తలకిందులయ్యాయి. స్థానికసంస్థల ఎన్నికల గడువు ముగిసినప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. 2024 జూన్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసింది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి దాదాపు 20 నెలలు కావస్తోంది. పదవులు ఆశించిన నేతలకు రిజర్వేషన్లు కలిసి రాకపోవడం బాధిస్తోంది. బీసీలకు స్థానాలు పెరగడంపై ఆ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నాయకుల ఆశలపై నీళ్లు..**

కొత్తగా ఏర్పడిన మండలాల్లో మొదటిసారి జరుగనున్న జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో గెలిచి సత్తాచాటాలని ఉత్సాహంగా ఉన్న నాయకుల ఆశలు అడియాశలయ్యాయి. ఆర్మూర్ నియోజకవర్గంలో ఆలూర్, డొంకేశ్వర్ కొత్త మండలాలుగా సుమారు రేండేళ్ల క్రితం ఏర్పాటయ్యాయి. చిన్న మండలాలు కావడంతో కొందరు నాయకులు జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో పోటీ చేయాలని కసరత్తు చేస్తు ఆ దిశగా నడుస్తున్నారు. వీరికి రిజర్వేషన్లు కలిసి రాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. ఆలూర్‌లో పలువురు నాయకులు పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అలాంటి వారికి రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఆలూర్ జడ్పీటీసీ స్థానం ఎస్సీ మహిళ, ఎంపీపీ పదవిని ఎస్సీకి కేటాయించారు. డొంకేశ్వర్లో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఎస్సీ మహిళలకే కేటాయించారు. దీంతో పోటీకి సిద్ధపడ్డ నాయకుల ఆశలు అడియాశలయ్యాయి. ఆర్మూర్‌లో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు రెండు జనరల్ మహిళలకే రిజర్వు కావడంతో పోటీ చేయాలనుకున్న నాయకులకు అవకాశం లేకుండా పోయింది. ఆర్మూర్ జడ్పీటీసీల స్థానం 20ఏళ్ల అనంతరం మహిళలకు రిజర్వు అయింది. పోటీ చేయాలని ఆశించిన నాయకులకు చేదు మాత్ర మింగినట్లు అవుతుంది.

**బాల్కొండ సెగ్మెంట్లో**

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు తమకు అనుకూలంగా (మిగతా 8వ పేజీలో)



## చిత్తూ.. చిత్తూల బొమ్మ

**అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు**



జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గడ్డం సుమనా రెడ్డి

జిల్లాలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. సోమవారం కొన్ని ప్రాంతాలలో సద్దుల బతుకమ్మను గంగమ్మ ఒడికి సాగనంపారు. గ్రామాలలో మహిళలు, యువతులు పెద్దఎత్తున బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. మరో పక్క ఊరూ వాడా పూలవనంలా మారి పోయింది. ఈనెల 2న ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం, మంగళవారం నిర్వహించే సద్దుల బతుకమ్మతో ముగిశాయి.

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్ని అంటాయి. మధ్యాహ్నం నుండే పేర్చి బతుకమ్మలో గౌరమ్మను ఉంచి ప్రత్యేక పూజలు చేసి ఇంటి ముందు ఉంచి తోటి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అటుతర్వాత మహిళలంతా బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని పలు కూడళ్లు, ఆలయాల వద్ద గుంపులు గుంపులుగా మహిళలు బతుకమ్మ ఆడారు. ప్రధాన కూడళ్లు, ఆలయాలు ఆటపాటలతో మార్మోగాయి. అనంతరం చెరువులు, కుంటల వద్ద బతుకమ్మను నిమజ్జనం చేశారు. జిల్లాకేంద్రం లోని ఖిల్లా బొడ్డెమ్మ చెరువు, నీలకంఠేశ్వర కోనేరు, అయోధ్యనగర్‌లోని బతుకమ్మ కుంట, పూలాంగ్ వాగు, తదితర ప్రాంతాలలో బతుకమ్మ వేడుకలతో సందడిగా మారాయి. నగరంలో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త పాల్గొన్నారు.





బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మహిళ

యాదిలో..

## అప్పట్లా లేదు.. చాలా మార్పు వచ్చింది



నాడు బతుకమ్మ పాటలు పాడుతూ ఇంటింటా తిరుగుతూ గ్రామ నడిబొడ్డు వచ్చే వరకు రాత్రి అయ్యేది. అక్కడి నుంచి అందరం మహిళలం కలిసి బతుకమ్మను ఆడుతూ.. నిమజ్జనం చేసేవాళ్లం. ఇప్పుడు అంతా డీజే సౌండ్ సిస్టమ్‌లతో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. చాలా మార్పు వచ్చింది. కానీ మా అప్పుడే బాగుండే. స్వంతంగా పాటలు పాడుతూ.. బతుకమ్మ ఆడేవాళ్లం.

- గంగామణి, కంజర, మోపాల్ మండలం

## బతుకమ్మ మాకు విశేషమైనది



బతుకమ్మ ప్రతి ఆడపడుచుకు విశేషమైన పండుగ. తెలుగింటి ఆడపడుచుగా భావిస్తూ గౌరమ్మను చల్లగా దీవించమని వేడుతూ ముచ్చటగొలిపే సంప్రదాయాన్ని తెలియపరిచే పాటలతో ఆడుతూ సుఖసౌభాగ్యాలను ప్రసాదించమని వేడుకుంటూ మన గౌరవాన్ని చాటే పండగ బతుకమ్మ. మా చిన్నప్పుడు పొద్దున్నే పొలాలకు వెళ్లి పూలు కోసుకొచ్చేవాళ్లం. 9రోజులు సందడిగా గడిపేవాళ్లం.

-నీలప్రియ, శ్రీనివాసనగర్‌కాలనీ, నిజామాబాద్

## జీవనశైలే బతుకమ్మ పాటగా..



నాటి బతుకమ్మ వేడుకల్లో జీవనశైలే బతుకమ్మ పాటగా మారింది. పూల పండుగ వచ్చిందంటే బతుకమ్మను పేర్చడం ఎంత ప్రాధాన్యత ఇచ్చేవారో పాటలో జీవనశైలి ప్రతిబింబించేది. చేతివృత్తుల వారితో మొదలై రామాయణ కాలం నాటి పాత్రలు సైతం పాటలో వచ్చేది. జానపద పాటలతో పాటు ఆధ్యాత్మిక పాటలు బతుకమ్మ ఆటలో వినిపించేది. ఒక్కొక్క పాట ఎంతో ఆనందాన్ని ఇచ్చేది.

- సాయమ్మ, న్యూహౌజింగ్ బోర్డు కాలనీ





# క్రైం సమాచారం

## హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఒకరిపై హత్యయత్నం చేసిన వ్యక్తికి 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి పి.సాయిసుధ సోమవారం తీర్పు చెప్పారు. నగరంలోని రైల్వేస్టేషన్ చౌరస్తాలోని వైన్స్ పర్మిట్ రూమ్‌లో నవీపేట్ మండలం కమలాపూర్‌కు చెందిన షేక్ షవాలి కార్మికునిగా పనిచేసేవాడు. ఆదిలాబాద్‌లోని బర్కత్‌పురకు చెందిన సయ్యద్ షకీల్ రైల్వేస్టేషన్‌లో కార్మికుడిగా పనిచేసేవాడు. 18అక్టోబరు 2021న మద్యం దుకాణంలో జరిగిన గొడవలో షేక్ షవాలిని చాకుతో పొడవడానికి షకీల్ ప్రయత్నించగా.. షవాలికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ కేసులో న్యాయాధికారి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## నాళేశ్వర్‌లో బైక్ చోరీ

నవీపేట,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో సోమవారం బైక్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన తూము లక్ష్మణ్ అనే రైతు తన బైక్‌ను పొలం వద్ద నిలిపి ఉంచి లోపలికి వెళ్లగా ఇద్దరు వ్యక్తులు మరో బైక్‌పై వచ్చి లక్ష్మణ్‌కు చెందిన హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. బైక్ దొంగతనానికి పాల్పడిన వారు గతంలో గ్రామ శివారులోని మేకల మంద నుండి పలు మేకలను ఎత్తుకెళ్లారని స్థానికులు పేర్కొన్నారు. బైక్ చోరీ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

## బాలుడిపై కుక్కల దాడి

ముప్కాల్,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. తాజాగా బాల్కొండలోని పెద్దబజార్‌లో ఇంటిముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల సయ్యద్ అబుజార్‌పై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాలుడిని చికిత్స కోసం బాల్కొండ ఆసుపత్రికి తరలించగా అక్కడ మందులు లేవు. దీంతో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అమెరికాలో బోధన్ వాసి మృతి



హైమద్ సోఫీ (ఫైల్)

బోధన్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేంజల్‌మెస్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మక్సూద్ హైమద్ సోఫీ(64) అనే వ్యక్తి ఆదివారం అమెరికా గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మహ్మద్ మక్సూద్ హైమద్ సోఫీ బోధన్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందారు. అమెరికాలో తన కుమారుడు మహ్మద్ ఇలియాస్ సోఫీ ఉద్యోగం చేస్తుండగా అక్కడ అతని కుటుంబీలను కలవడానికి 20వ తేదీన వెళ్లారు. వారం రోజుల్లోనే అమెరికాలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

## పోతంగల్‌లో ఆక్రమణల తొలగింపు

కోటగిరి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలోని ఓ స్థలంలో సెలవు రోజుల్లో వేసిన స్తంభాలు, రేకుల షెడ్డును పోలీసు బందోబస్తు నడుమ గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారు. సర్వే చేసి హద్దులు నిర్ణయించే వరకు ఎవరు కూడా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయవద్దని తహసీల్దార్ గంగాధర్ హెచ్చరించారు. దసరా పండుగ తర్వాత 171, 172, 173 సర్వే నెంబర్‌లలో సర్వే చేయించి హద్దులు నిర్ణయిస్తామని పేర్కొన్నారు. సర్వే అయ్యేంత వరకు ఎవరు కూడా నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ పోశెట్టి, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, ఏఎస్ఐ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ సరస్వతి ఆలయంలో యజ్ఞం



పాతవర్నిలో కొలువైన అమ్మవారు



నవీపేట: అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

# అక్షరాభ్యాసాలు.. హోమాలు

దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి సమక్షంలో పలువురు బాల, బాలికలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



వెంచిర్యాల్‌లో దుర్గాదేవి



మనోహరాబాద్‌లో యజ్ఞం



పాతూర్‌లో యజ్ఞం చేస్తున్న దృశ్యం



వేల్పూర్ కుంకుమార్చణలో ..

## బోధన్‌లో విశిష్ట ఆలయాలున్నాయి: మైనంపల్లి

బోధన్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని ఆలయాలకు చాలా విశిష్టత ఉందని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు అన్నారు. సోమవారం పట్టణంలోని చక్రేశ్వర శివాలయం, ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చారిత్రత్మక ఆలయాలను సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు గణేష్ మహరాజ్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, గోశాల చైర్మన్ గోపాల్ సింగ్, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షులు, జగన్, బీర్కూర్ బుజ్జి పాల్గొన్నారు.



శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

## అర్హులకే ఇళ్లు కేటాయించాలి



ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నేతలు

ఆర్మూర్, సెప్టెంబరు, 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్‌లో అర్హులకే ఇళ్లు కేటాయించాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనర్హులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను రద్దు చేయాలని మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. 81 మంది అర్హులకు ఇవ్వగా మిగిలిన ఇళ్లను సర్వే చేసి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. మొదటి సర్వే లిస్టులో అర్హులైన వారిని తొలగించి, అనర్హులకు ఇళ్లు కేటాయించడం సరికాదన్నారు. గతంలో ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పోరాటం చేసిన వారికి కేటాయించకుండా పక్కనబెట్టడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం అర్హులైన వారికే ఇళ్లు కేటాయించి పేదలకు లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ కార్యదర్శి బి.కిషన్, లింబాద్రి, నిఖిల్, రఫీ, పోశెట్టి, రాజమని, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## సహకారంతోనే విండో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సాయిబాబా, పాల్గొన్న రైతులు

వర్ని, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సహకారంతో విండో అభివృద్ధికి కృషి చేసినట్లు పాత వర్ని సహకార సంఘం చైర్మన్ నామాల సాయిబాబా పేర్కొన్నారు. సోమవారం విండో ఆవరణలో ఏర్పాటు చేసిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో ఎరువులను పంపిణీ చేసి రుణ మంజూరులో కృషి చేసినట్లు చెప్పారు. ఇందుకు సహకరించిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సభ్యులు వంకా నాగరాజు, గంగప్ప, వెంకటేశ్వరరావు, బాబియా, సురేందర్, రాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆర్మూర్, సెప్టెంబరు, 29(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదలకు పంటలు నష్టపోయిన రైతులకుపరిహారం చెల్లించాలని సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడారు. వర్షాలు, వరదల వల్ల జిల్లాలో వేలాది ఎకరాలలో పంట నీటమునిగిందని, కొన్ని చోట్ల ఇసుక మేటలు వేసిందన్నారు. చేతికివచ్చే సమయంలో పంట నష్టపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. పంటలు నీటమునిగి రైతులు నష్టపోయారని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ.25వేల పరిహారం ఇవ్వాలని మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూమన్న, సీఐటీయూ మండల కన్వీనర్ ఎల్లయ్య, సాయన్న, చిన్నయ్య, సాయిలు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అదనంగా డబ్బులు వసూలు చేయొద్దు



మాట్లాడుతున్న నర్సయ్య

భీమ్‌గల్, సెప్టెంబరు, 29(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద హమాలీ ఛార్జీలను అదనంగా వసులు చేయవద్దని రైతులు కోరారు. సోమవారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్ శివసారి నర్సయ్య అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గత 6నెలల ఆదాయ, వ్యయ వివరాలను కార్యదర్శి రవీందర్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని సొసైటీ డైరెక్టర్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సన్నద్ధం కావాలని, ఇందుకు రైతులు కూడా సహకారం అందించాలని కోరారు. కేంద్రాలకు ప్రభుత్వం అందిస్తున్న గన్నీ బ్యాగులను సక్రమంగా వినియోగంచుకుందామని చైర్మన్ కోరారు. కొనుగోలు కేంద్రాలను సరైన సమయంలో ప్రారంభించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జిన్నా శోభన్, డైరెక్టర్లు దశగౌడ్, ప్రకాష్, అన్ని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జెట్ ఇన్నోవేటివ్ అవార్డు



అవార్డు అందుకున్న బోయాడ నర్సయ్య

ముప్కాల్ , సెప్టెంబరు, 29 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని బస్వాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన బోయాడ నర్సయ్య జెట్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు 2025ను సోమవారం అందుకున్నారు. ఈయన వినూత్నమైన బోధన పద్ధతులను అవలంబించడం, డిజిటల్ మాధ్యమాన్ని విరివిగా వాడడం, సులభమైన బోధనా భ్యాస సామాగ్రి తయారు చేసి బోధించడం వల్ల నర్సయ్యకు ఈ అవార్డు దక్కింది. ఈ అవార్డును వింగ్ కమాండర్ ఆంటోని, జెట్ ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ్ కుమార్ చేతుల మీదుగా హైదరాబాద్‌లోని హరిహర కళా నిలయంలో ఆయనకు అందజేశారు. ఈ అవార్డుతో పాటు 5వేల రూపాయల రివార్డును ఆయన అందుకున్నారు. ఈసందర్భంగా బాల్కొండ మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు.

## భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి



ఎడపల్లి మండల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఎడపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఎడపల్లి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తు లను గ్రామాల వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. సదస్సులు ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆయా మ్యాడ్యూల్స్‌లలో ఎన్ని అర్జీలను పరిష్కరించారు, పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి, ఎంతమందికి నోటీసులిచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందా లేదా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సాదాబైనామా దరఖాస్తులను ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ఆదారంగా పరిష్కరించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా చూడాలన్నారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ప్రక్రియను చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. గడువులోపు ఎస్ఐఆర్ పూర్తి చేయాలన్నారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేయగా.. ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల రిజర్వేషన్ వివరాలను, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ దత్తాత్రి, ఉప తహసీల్దార్ అనూష, మండల పరిషత్ అధికారి మన్మోహన్ శాస్త్రి తదితరలు ఉన్నారు.

## ఆర్మూర్ మండలంలో రిజర్వేషన్లు ఇవే

ఆర్మూర్, సెప్టెంబరు, 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్ల జాబితాను అధికారులు ప్రకటించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. అంకాపూర్ ఎంపీటీసీ 1వ స్థానం బీసీ, అంకాపూర్ 2 బీసీ మహిళ, చేపూర్ ఓసీ మహిళ, ఫత్తెపూర్ బీసీ, గోవింద్‌పేట్ ఎస్సీ మహిళ, ఇస్సాపల్లి ఎస్సీ, మగ్గిడి ఎస్సీ మంథని బీసీ మహిళ, పిప్రి 1 జనరల్, పిప్రి 2 బీసీ, సుర్బిర్యాల్ ఎస్టీలకు రిజర్వు చేసినట్లు ఎంపీడీవో శివాజీ తెలిపారు.

**సర్పంచ్‌ల స్థానాల రిజర్వేషన్లు**

మండలంలోని సర్పంచ్‌ల రిజర్వేషన్లను అధికారులు వెల్లడించారు. అమ్దాపూర్ ఎస్సీ అంకాపూర్ బీసీ, గోవింద్‌పేట్ బీసీ, మగ్గిడి బీసీ, చేపూర్ జనరల్ మహిళ, ఫత్తెపూర్ జనరల్ మహిళ, ఇస్సాపల్లి బీసీ మహిళ, ఖానాపూర్ బీసీ మహిళ, మంథని బీసీ మహిళ, కోమన్‌పల్లి జనరల్, హరిపురం(చేపూర్‌పల్లె) ఎస్సీ మహిళ, పిప్రి ఎస్సీ, రాంపూర్ జనరల్, సుర్బిర్యాల్ ఎస్టీ అని ఎంపీడీవో శివాజీ తెలిపారు.

## దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి

రెంజల్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఎగువన మహారాష్ట్ర, నిజాంసాగర్ నీటి ప్రవాహంతో నీలా గ్రామంలో సుమారు 5వేల ఎకరాలలో వరి, సోయా పంటలు ముంపునకు గురైనట్లు రైతులు తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించలేదని వారు వాపోయారు. ఎగువ నుంచి 3.50లక్షల క్యూసెక్కుల నీరు వస్తే.. దిగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు లక్ష 50వేల క్యూసెక్కులను వదలడంతో కందకుర్తి గోదావరి నుంచి 5కిలోమీటర్ల దూరంలో నీలా శివారులో మొత్తం పంటలు నీటిలో మునగడంతో రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని సోమవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్‌కు, రెంజల్ తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.నీలాను ముంపు గ్రామంగా ప్రకటించి తక్షణ సాయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, బీజేపీ మండల అధ్యక్షుడు యోగేష్, గంగాధర్, లక్ష్మణ్, సంతోష్, రాజేందర్, సద్దాం, నసీర్, ఖాజామొయినోద్దీన్ పాల్గొన్నారు.

నవీపేట,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): వరదలతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.50వేల పరిహారం చెల్లించాలని పలువురు రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు పలువురు రైతులు కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. మండలంలోని నందిగామ, అల్జాపూర్, యంచలలో గోదావరి వరదలతో వందలాది ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయని వారు పేర్కొన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఏర్పాటు చేసిన చేపల చెరువును తొలగించాలని కోరారు. అధికారులు స్పందించి ఆదుకుంటే రైతుల బతుకులు మారతాయని చెప్పారు.

## కార్మికుల చట్టాలను కాలరాస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

బోధన్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికుల చట్టాలను కాలరాస్తూ నల్ల చట్టాలను తేవడం కారణంగా అనేక సంక్షేమ పథకాలు కార్మికులకు అమలు కాకుండా పోయే ప్రమాదముందని తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవన్‌లో సీఐటీయూ అనుబంధంతో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బోధన్‌లో జిల్లా 2వ మహాసభలను నిర్వహించారు. రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా భవన కార్మికులు తమ హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. సంక్షేమ పథకాలు భవన కార్మికులకు అందేటట్లు చూసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శంకర్ గౌడ్, నూర్జహాన్, గంగాధర్, జిల్లా భవన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణనర్సయ్య, రాములు, జమున, సావిత్రి, గంగామణి, పోశవ్వ, నరేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

వేల్పూర్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న, సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్ డిమాండ్ చేశారు. సోమవారం వేల్పూర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షంతో పంటనష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దసరా తర్వాత వరి కోతలు జోరందుకుంటాయని, ఆలోపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రబీ సీజన్‌లో సన్నవడ్లకు బోనస్ ఇంకా రాలేదని, ఈ సీజన్‌లోనైనా ఇవ్వాలన్నారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో మల్కన్నగారి మోహన్, నర్సారెడ్డి, శ్రీధర్‌గౌడ్, నాగేష్, ప్రవీణ్, రాజారెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ

ఏర్గట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం ఆరుగురి రూ.1.90లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నేతలు ఆరుగురు లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, నర్సారెడ్డి, గడ్డం జీవన్, దండెవోయిన సాయికుమార్, అజయ్, సహదేవ్, మెరుగు సురేష్ పాల్గొన్నారు.

## యువకుడికి సన్మానం

నవీపేట,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): కోస్లీకి చెందిన వినోద్ రెంజల్ మండలంలో ఎస్‌జీటీగా పని చేస్తూ.. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాలలో డీపీవో ఉద్యోగం సాధించాడు. సోమవారం పలువురు యువకులు ఘనంగా సన్మానించారు. సందీప్, సతీష్, యోగేష్, లక్ష్మణ్, లాలు, రియాజ్ ఉన్నారు.

## ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలి



సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు

రెంజల్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గంలోని రెంజల్ మండలం ఏర్పాటై 40ఏళ్ల గడుస్తున్న నాటి నుండి నేటి వరకు జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ చేసిన దాఖలాలు లేవని, ప్రజాస్వామ్య దేశంలో కనీసం ఎస్సీ ఎస్టీలకు మండలం ఏర్పాటు అయి 40ఏళ్లు గడుస్తున్న ఒక్కసారి జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను రిజర్వ్ చేయకపోవడాన్ని ఖండిస్తూ సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు నీరడి రవి, సిరివేసు సంతోష్, జాదవ్ ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. జనాభా దామాషా ప్రకారం రెంజల్ మండలంలో ఎస్సీ, ఎస్టీలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత రిజర్వేషన్ రొటేషన్ ప్రకారం కల్పిస్తున్నప్పటికీ రెంజల్ స్థానాన్ని జనరల్ కేటాయించడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెంజల్ స్థానాలను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని లేనియెడల ఉద్యమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్ ఆధ్వర్యంలో 2కే వాక్



మెడికవర్ ఆధ్వర్యంలో వాక్ నిర్వహిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న అదనపు డీసీపీ బస్వారెడ్డి

ఇందూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రుక్మిణి చాంబర్స్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు 2కె వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి పాల్గొన్నారు. ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని, చిన్న వయస్సులోనే ఈ జబ్బులు రావడం ఆందోళనకరమైన విషయమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం అలవర్చుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని అన్నారు. మెడికవర్ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సదానందరెడ్డి మాట్లాడుతూ, క్రమం తప్పని హెల్త్ చెక్-అప్స్, బరువు నియంత్రణ, జంక్ ఫుడ్ నివారణ, నియమిత వ్యాయామం, ధూమపానం, మద్యపానం దూరం పెట్టడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఆధునిక జీవనశైలి, ఒత్తిడి, రాత్రి నిద్రలేమి, ఫిజికల్ యాక్టివిటీ తగ్గిపోవడం వల్ల యువతలో హృదయ సమస్యలు పెరుగుతున్నాయని కార్డియాలజిస్ట్ సందీప్ రావు అన్నారు. కార్యక్రమంలో కార్డియాలజిస్టులు డాక్టర్ జగదీష్ చంద్ర బోస్, డాక్టర్ వారిస్ అలీ పాల్గొని గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

## రైతులకు గత సీజన్ బోనస్ ఇవ్వాలి

రెంజల్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని దూపల్లి సొసైటీ చైర్మన్ భూంరెడ్డి అన్నారు. సోమవారం సొసైటీ మహాజన సభను నిర్వహించారు. యాసంగి పంటకు ప్రభుత్వం బోనస్ అందించాలని సూచించారు. సొసైటీకి సంబంధించిన జమ, ఖర్చుల లెక్కలను సొసైటీ కార్యదర్శి జీవన్ రెడ్డి చదివి వినిపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, వీడీసీ చైర్మన్ బాబన్న, డైరెక్టర్‌లు సాయిలు, ప్రతాప్‌రెడ్డి, శ్రీదేవి ఉన్నారు.

**రాయకూర్, రుద్రూర్‌లో మహాసభలు..**

రుద్రూర్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): రాయకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ రాయకూర్ సంఘం వద్ద సహకార సంఘం చైర్మన్ సంగమేశ్వర్ రావు, రుద్రూరు సొసైటీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మహాజన సభ నిర్వహించారు.

## హంగర్గను సందర్శించిన అధికారులు



గ్రామంలో పరిశీలిస్తున్న అధికారులు

బోధన్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంగర్గ గ్రామాన్ని సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. గ్రామంలోని వరద ఉధృతిని అడిగి తెలుసుకున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామం జలదిగ్బంధంలో ఉంది. గ్రామస్థులను, వృద్ధులను, మహిళలను పునరావాస కేంద్రాలకు తరలించినా.. తాగునీరు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులకు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం చుట్టూ వరద ఉండడంతో ఎటూ పరిస్థితి ఉందని తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పంటలు నీటిలోనే మునిగి ఉన్నాయి. కొంచెం కొంచెంగా వరద నీరు తగ్గే అవకాశం ఉందని తహసీల్దార్ విఠల్ తెలిపారు. గ్రామాన్ని సందర్శించడం జరిగిందని, గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో 8 అడుగుల వరకు చేరిన వరద మెల్లమెల్లగా తగ్గుముఖం పడుతుందన్నారు. గ్రామస్థులు అన్ని విధాలుగా ఆదుకోవడానికి చర్యలు చేపట్టామన్నారు.



## మహిళలకు ముఖ్యమైన వేడుక..

మహిళలకు బతుకమ్మ వేడుకలు ముఖ్యమైనవి. నేను చిన్నప్పటి నుంచి ఏటా స్నేహితులు, బంధువులతో కలిసి వేడుకల్లో పాల్గొంటా. సాంప్రదాయ పద్ధతుల ప్రకారం నిత్యం ఒక్కో లా బతుకమ్మలను పేర్చి ఆడిపాడతాం. కొన్నిచోట్ల కాగితం పూలతో బతుకమ్మలను తయారుచేస్తున్నారు. అలా కాకుండా ప్రకృతిలోని పూలనే వినియోగిస్తే బాగుంటుంది.

● ఉమాలత, తహసీల్దార్, రామారెడ్డి



## బతుకమ్మ అంటే ఆడపడుచుల పండగ..

బతుకమ్మ అంటే ఆడపడుచుల పండుగ. చిన్నప్పటి నుంచి ఒక్కసారి కూడా బతుకమ్మ వేడుకలకు దూరంగా లేను. చిన్నతనంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నా. 20 ఏళ్ల క్రితం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

● అనితారెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్, నిజామాబాద్



## ప్రకృతిలో దొరికే పూలనే వాడేవాళ్లం..

బతుకమ్మ పండగ వచ్చిందంటే సంబరంగా ఉండేది. ప్రకృతిలో పూలతోనే బతుకమ్మను తయారుచేసేవాళ్లం. ప్రస్తుతం కాగితపు పూలను వాడాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకే మనం ప్రకృతిని కాపాడుకోవాలి. బతుకమ్మ అంటేనే ప్రకృతి పండగ. మా చిన్నతనంలో చూసిన పండగకి ఇప్పుడు నిర్వహిస్తున్న వాటికి చాలా తేడా ఉంది.

●బట్టు నర్సవ్వ, శ్రీరాంనగర్, కామారెడ్డి







అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

# బాసరకు పోటెత్తిన భక్తులు

- మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని భారీగా భక్తుల రాక
- 1,883 మంది పిల్లలకు అక్షర శ్రీకార పూజలు

బాసర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ సరస్వతీ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల ఎనిమిదవ రోజు అమ్మవారు మహాగౌరీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి పర్వదినాల్లో అతి ముఖ్యమైన మూఢ నక్షత్రం సందర్భంగా ఎనిమిదవ రోజు ప్రత్యేకత సంతరించుకుంది. ఈ రోజు జరిపించే అక్షర శ్రీకార పూజలు భక్తులలో విశేషమైన ఆదరణ పొందాయి. పిల్లలు విజ్ఞానవంతులు అవుతారని విశ్వాసంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా 1,883 కుటుంబాలు బాసరకు చేరి పూజలు జరిపించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు తెల్లవారు జామునే పూజలు ప్రారంభించారు. భక్తులకు వేచి ఉండే సమయం తగ్గించేందుకు నాలుగు చోట్ల పూజా మండపాలు ఏర్పాటు చేయడంతో యాత్రికులు సులభంగా పూజలు జరిపించుకునే అవకాశం లభించింది. అయితే ఈసారి వరదల ప్రభావం భక్తుల రాకపై కొంత ప్రభావం చూపింది. గత మూడు నాలుగు రోజులుగా బాసరలో భారీ వర్షాలు పడుతున్నాయన్న సమాచారం ప్రచారం కావడంతో చిన్నారులతో రాకకు భక్తులు వెనుకంజ వేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి సగం మాత్రమే బాసర చేరినట్లు అధికారులు వెల్లడించారు.



అన్నం వడ్డిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

## అమ్మవారి సేవలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కొలువుదీరిన అమ్మవారికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్గాదేవి విజయానికి గుర్తుగా ప్రజలందరూ జరుపుకునే పండుగ అని అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడం విశేషంగా భావించాలని అన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో బతుకమ్మ, దసరా పండుగలకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, మార్కెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కమల్‌కిశోర్, సెక్రెటరీ మల్లేష్, మాస్టర్ శంకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలకు రెండు దరఖాస్తులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు సోమవారం రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. మొదటి దరఖాస్తు నందిపేట్ 3వ దుకాణానికి, 2వ దరఖాస్తు సిరికొండ మండలం మైలారం గ్రామానికి చెందిన మద్యం దుకాణానికి చెందినదని తెలిపారు. నందిపేట్ దుకాణానికి కోరిపల్లి రజిత, మైలారం మద్యం దుకాణానికి జి.శ్రీనివాస్‌రావు దరఖాస్తు చేశారని చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న బస్వలక్ష్మీనర్సయ్య

## కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బస్వ లక్ష్మీనర్సయ్య

సుభాష్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బస్వ లక్ష్మీనర్సయ్య బాధ్యతలు స్వీకరించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యాలయంలో బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం పట్ల జిల్లా బీజేపీ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర విభాగానికి అధ్యక్షుని చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు, కిసాన్‌మోర్చ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## డైరెక్టర్‌కు సన్మానం

మాచారెడ్డి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా నియమితులైననా ఏనుగు నర్సింహారెడ్డిని రవీంద్రబారతిలో సామవారం యువకవి కళ్లెం నవీన్, ప్రముఖ గజల్ కవి శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



పాతబాన్సువాడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఆర్మూర్ తహసీల్ కార్యాలయంలో..



మెంగారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిన్నమల్లారెడ్డిలో బతుకమ్మ తీసుకొస్తున్న కామారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇంటింటా మహిళలు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను అలంకరించి వేడుకలు నిర్వహించారు.**

● ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



బాన్సువాడలో దేవీ అవతారంలో బతుకమ్మ



వేల్పూర్‌లో బతుకమ్మకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి



చుక్కాపూర్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న మహిళలు



నాళేశ్వర్‌లో బతుకమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువతులు, బాలికలు



పోచారం గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



నిజామాబాద్ రూరల్ మండలం సారంగపూర్‌లో బతుకమ్మ సంబరాలు



మహమ్మద్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సదాశివనగర్ మండలం అమర్లబండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బాన్సువాడలో తులసీ కోట రూపంలో బతుకమ్మను పేర్చిన మహిళలు



ఎల్లారెడ్డి దేవునిపల్లిలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

# ఒక్క ఓటు లేకున్నా.. రిజర్వేషన్

నసురుల్లాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఒక్క ఎస్టీ ఓటు కూడా లేదు. కానీ అధికారులు మాత్రం సర్పంచ్ స్థానానికి ఎస్టీ రిజర్వేషన్ కేటాయించడంతో గ్రామస్తులు అయోమయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు గాను డ్రాపద్ధతి ద్వారా రిజర్వేషన్లు కేటాయించగా నస్రులాబాద్ మండలం అంకోల్ సర్పంచ్ స్థానానికి ఎస్టీ రిజర్వేషన్ అయింది. కానీ గ్రామంలో ఒక్క ఎస్టీ ఓటు కూడా లేకపోవడంతో గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేస్తామని తెలిపారు.కాగా రిజర్వేషన్ కేటాయించి నప్పుడు గ్రామంలో ఎన్ని ఓట్లు ఎలా ఉన్నాయో ఏ రిజర్వేషన్ ప్రకారం గ్రామస్తులకు ఓటర్లకు న్యాయం జరుగుతుందో అన్నీ తెలుసుకొని అధికారులు రిజర్వేషన్లు కేటాయించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంకోల్ గ్రామానికి రిజర్వేషన్ మార్పు చేయాలని కోరుతున్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



గిరిధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహా రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హా ల్‌లో నిర్వహించిన పంచాయతీరాజ్ డీఈ గిరిధర్ పదవీ విర మణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పదవీకాలంలో చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయని అన్నారు. అనంత రం గిరిధర్ మాట్లాడుతూ.. 40 ఏళ్ల తన ఉద్యోగ ప్రస్థానంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొని పనిచేశానని చెప్పారు. అందరి సహకారంతో ఉద్యోగ ప్రయాణం సాఫీగా కొనసాగిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

## పారిశుధ్య కార్మికుల ధర్నా

కోటగిరి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. మూడు నెలలు బకాయి వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విధులు నిర్వహించమని హెచ్చరించారు. కార్యక్రమంలో హన్మాండ్లు, పోశెట్టి, సాయిలు, బ్రహ్మం, లింగం, లింగవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల బిల్లుల పంపిణీ

బోధన్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఎరాజ్‌పల్లి గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరువర్గాల మధ్య గొడవ

బీర్కూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ సహకార సంఘ మహాజన సభను సంఘం అధ్యక్షుడు రాములు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సీఈఓ విఠల్ సంఘానికి సంబంధించిన లావాదేవీలు, ఆదాయ, వ్యయాలు, ఆస్తులు, వ్యాపారాలు తదితర వివరాలను సభ్యులకు చదివి వినిపించారు. అయితే సంఘం తరఫున హైకోర్టు లాయర్‌కు రూ.3 లక్షలు ఫీజుగా చెల్లించిన విషయమై సభ్యులు నిలదీశారు. 2015-16 నుంచి ఇప్పటివరకు ఐటీ రిటర్న్ ఫైల్ చేయకపోవడం వల్లనే ఐటీ శాఖ నుండి నోటీసులు జారీ అయ్యాయని సీఈవో తెలిపారు. ఈ విషయమై లాయర్‌ను సంప్రదించామని తెలిపారు. ఫీజుగా రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉండగా, పాలకవర్గ తీర్మానం మేరకు ఆ మొత్తం చెల్లించామన్నారు. ఐటీ రిటర్న్‌ను ప్రతి ఏటా ఫైల్ చేయాలి కదా, ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. చేసిన తప్పుకు సంఘం ఎందుకు డబ్బులు ఇవ్వాలని ప్రశ్నించారు. ఈ విషయంలో సభ్యులు రెండు వర్గాలుగా విడిపోగా వాగ్వాదం జరిగింది. పెద్దలు కలుగచేసుకుని ఇరు వర్గాలను సముదాయించారు. అనంతరం అక్కడి నుండి అందరూ వెళ్లిపోయారు.



వాగ్వాదం చేసుకుంటున్న ఇరు వర్గాలు



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## రిజర్వేషన్ల మార్పు చేపట్టాలని వినతి

బాన్సువాడరూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు, బోర్లం గ్రామాల్లో ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల కొరకు చేపట్టిన రిజర్వేషన్లను మార్పులు చేయాలని కోరుతూ జిల్లా అదపు కలెక్టర్ విక్టర్‌కు బీఆర్ఎస్ నాయకులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్పందించి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బోడ రాంచందర్, అనీల్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

సదాశివనగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా చేసుకోవాలని ఎస్సై పుష్పరాజ్ అన్నారు. సదాశివనగర్ మండల దుర్గామాత మండపాల నిర్వాహకులతో సోమవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్సై పుష్పరాజ్

# బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శుల నియామకం

కామారెడ్డిటౌన్, బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాగ్కోల్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పోతుల బొగుడ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డికి చెందిన బండారి నరేందర్ రెడ్డిని పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శులుగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి ఆర్ఎస్ఎస్‌లో 17 సంవత్సరాల పాటు నిర్విరామంగా పనిచేశారన్నారు. ఇక నరేందర్ రెడ్డికి రెండవ సారి అవకాశం వచ్చిందన్నారు. నూతనంగా నియమితులైన వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకముంచి జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు.



బండారి నరేందర్ రెడ్డి



పోతుల బొగుడ శ్రీనివాస్ రెడ్డి

## ఎల్లారెడ్డి వాసికి గ్రూప్-1 ఉద్యోగం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కష్టపడితే సాధ్యం కానిది ఏదీ లేదని ఎల్లారెడ్డి మండలకేంద్రానికి చెందిన మన్నెం శివకుమార్ నిరూపించారు. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 98వ ర్యాంక్, మల్టీ జోన్‌లో 54వ ర్యాంక్ సాధించి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఉద్యోగాన్ని సాధించారు. యువతకు ఆదర్శంగా నిలిచారు. ఉపాధ్యాయ వృత్తిలో 20 ఏళ్లుగా పనిచేస్తూనే, పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందారు. చివరికి గ్రూప్-1 ఉద్యోగం సాధించారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



నియామక పత్రం అందుకుంటున్న శివకుమార్

## రాజుకు జెట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు

భిక్కనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందిస్తున్న 50 మందికి ఉత్తమ టీచర్ అవార్డుతో పాటుగా నగదు పురస్కారాన్ని సోమవారం హైదారాబాద్‌లోని హరిహర కళాభవనంలో అందజేశారు. కాగా ఈ అవార్డుకు భిక్కనూరు మండలకేంద్రానికి చెందిన బాలుర ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు తమ్మల రాజు ఎంపికయ్యారు. సైన్స్ కార్యక్రమాలలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నందున ఆయనకు ఈ అవార్డుతో పాటు, రూ.5వేల నగదును సంస్థ చైర్మన్, మాజీ వింగ్ కమాండర్ ఆంటోని అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రాజు మాట్లాడుతూ.. అవార్డు పొందడం సంతోషంగా ఉందని, మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతానన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు.

## ఆకాశ దీపాలపై అలసత్వమేల ?

(5వ పేజీ తరువాయి...)

మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఈ ఆకాశదీపం దెబ్బతిని సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటి వరకు వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయింది. ప్రధాన రహదారి కావడంతో రాత్రివేళలో వందల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ప్రతిరోజు రాత్రివేళ ఆ ప్రాంగణమంత చీకటిమయంగానే కనిపించడంతో రుద్రూర్‌లో అధికారుల పాలన ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. ఇప్పటికైనా ఈ ఆకాశ దీపాలకు మరమ్మతులు చేసి బాగు చేయాలని కోరుతున్నారు.

## రిజర్వేషన్ల ఖరారుతో ఆశలు గల్లంతు

(5వ పేజీ తరువాయి...)

వస్తాయని ఆశించి రేండేళ్లుగా ఎదురు చూస్తున్న నేతలకు రిజర్వేషన్లు కలిసి రాక తానొకటి తలిస్తే దైవం మరొకటి తలిచినట్లుగా తయారైంది. ఉమ్మడి మండలాన్ని శాసించిన ముప్కాల్ మండలంలో ఆశవాహులు అధికంగానే ఉన్నారు. వీరికి రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో విస్తు పోయారు. రాజకీయ చైతన్యం కలిగిన ముప్కాల్ మండలం ఈ సారి జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఎస్సీలకు రిజర్వు అయ్యాయి. వివిధ పార్టీలలో ఉన్న ముఖ్య నేతలు ఎన్నికల బరిలో దిగడానికి రంగం సిద్ధం చేసుకోగా రిజర్వేషన్ జాబితా చూసి అవాక్కయ్యారు. పోటీ చేయాలన్న వారి ఆశలు అడియాశలయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు పోటీ చేయాలని ఆశించిన నాయకులకు నిరాశ తప్పడం లేదు.

## ఎస్సారెస్పీకి భారీగా వరద

(5వ పేజీ తరువాయి...)

చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ప్రస్తుత నీటి మట్టం 1083 అడుగుల 53 టీఎంసీల నీటినిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూన్ 1 నుంచి ప్రాజెక్టులోకి 676 టీఎంసీల వరద నీరు చేరగా ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రధాన కాల్వలకు 631 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

## ధర్మారం(బి) మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ఇందల్వాయి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈదర పిచ్చేశ్వర్‌రావు వెన్నుముక విరగడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, సీనియర్ నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, వాసుబాబు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఆవుపై పులి దాడి

మోపాల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఆవుపై సోమవారం పులి దాడి చేసింది. మేతకు వెళ్లిన ఆవుపై ఒకేసారి పులిదాడి చేయడంతో పక్కన ఉన్న ఆవులు బెదిరిపోయాయి. ప్రతిరోజు ఆవులు ఆ ప్రాంతంలో మేతకు మేస్తూవస్తుంటాయి. ఆవుపై పులిదాడి చేసిందని తెలియడంతో ఆ ప్రాంత వాసులందరూ భయాందోళనకు గురయ్యారు. గతంలో కూడా పలుమార్లు ఆవు, మేకలపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని ఆప్రాంత గిరిజనులు తెలిపారు.ఫారెస్టు అధికారులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని పంచనామా చేశారు.

## అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఆనంద్‌కుమార్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎం.ఆనంద్‌కుమార్ బాధ్యతలను స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని ఆడిట్ కార్యాలయంలో సోమవారం జిల్లా అధికారి విజయ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. పదేళ్లుగా ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ పోస్టు ఆనంద్ కుమార్ రాకతో భర్తీ అయ్యింది. ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 పోస్టులో జిల్లాకు చెందిన ఆనంద్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ కుమార్ కుటుంబ సభ్యులు కరుణ, ఆనంద్,తేజస్విని, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు

బతుకమ్మలను ఆడుతున్న మహిళలు

బతుకమ్మలను చెరువులోకి తీసుకెళ్తున్న దృశ్యం

నగర సమీపంలో ఉన్న రఘునాథ చెరువులో బతుకమ్మ సంబరాలు ఘనంగా సాగాయి. వాటిలోని దృశ్యాలు

బతుకమ్మను స్కూటీపై తీసుకెళ్తున్న మహిళలు

బతుకమ్మ ఎత్తుకున్న మహిళ

పసుపు,కుంకుమను ఇస్తున్న మహిళలు

## రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలి

**• మహాజన సభలో రైతులు**

మోపాల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న సన్నబియ్యానికి బోనస్ రూ.500 వెంటనే ఇవ్వాలని ప లుగ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశా రు. సోమవారం మండలంలోని బాడ్సి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామంటేనే అనేక మంది రైతులు సన్న వడ్లను వేశారని అన్నారు. రెం డు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బోనస్ ప్రభుత్వం విడుదల చేయకకపోవడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతోనే సొసైటీ అభివృద్ధి బాటలో నడుస్తుందని అన్నారు. త్వరలోనే వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ రాజకిషన్, డైరెక్టర్లు సుమలత, రవీంధర్, కైలాస్, పృధ్వీరాజ్, నరేందర్, దేవిదాస్, సాయన్న, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, పిడుగు లక్ష్మి ఉన్నారు.

## బాధితకుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న జర్నలిస్టులు

ఇందల్వాయి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ లక్కవత్రి నారాయణ ఈనెల 11న గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. నారాయణ భార్య లక్ష్మికి డిచ్‌పల్లి ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా తరపున సోమవారం 15వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మురళి, ఉపాధ్యక్షులు సాయిలు, కోశాధికారి సయ్యద్ నయీం, సభ్యులు తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

(5వ పేజీ తరువాయి...)

అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి వినతులను సమర్పించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు ఉన్నారు.

**పదవీ విరమణ చేస్తున్న ఎస్సైకి సన్మానం..**

కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ ఈనెల పదవీ విరమణ చేస్తున్న ఎస్ఐ ఎండీ నషీర్‌ఉద్దీన్‌ను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నషీర్ ఉద్దీన్‌ను పూలమాలతో, శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా నషీర్ ఉద్దీన్ అందించిన సేవలను కొనియాడారు.

**పెండింగ్ బిల్లులను చెల్లించాలి**

తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని గురుకుల కాంట్రాక్టు అసోసియేషన్ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అన్ని గురుకులాల్లో ఆరు నెలలుగా అన్ని సరఫరా చేస్తున్న బిల్లులు రావడం లేదని అన్నారు. క్యాటరింగ్ చార్జీలు పెరిగినప్పటి నుంచి ఒక్క శాతం కూడా చార్జీలు పెంచలేదన్నారు. దసరా సెలవుల అనంతరం సంస్థలకు సరఫరా అందించలేమని సత్వరమే బిల్లులు చెల్లించాలని కోరారు. పెంచితేతప్ప అక్టోబరు 3నుంచి విధులకు హాజరుకాబోమన్నారు. కార్యక్రమంలో సవీన్, సుభాష్‌రెడ్డి, సాయిబసవ, రాజేందర్, విశాల్, సతీష్, రవికుమార్ పాల్గొన్నారు.

**వరద ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి**

గోదావరి వరదల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలు గ్రామస్తుల రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నవీపేట్ మండలంలోని యంచ, అల్జాపూర్, నందిగాం గ్రామాల్లో గోదావరి వరద వల్ల వేలాది ఎకరాల్లో పంటలు మునిగిపోయి పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. గోదావరి వరదల ప్రవాహం ఒకెత్తైతే వరదలకు అడ్డంగా ఎస్సారెస్పీ భూమిలో అక్రమంగా చేపల చెరువు నిర్మాణం చేయడం వల్ల వరద ఉధృతి ఎక్కువై మరింత నష్టం జరిగిందని తెలిఇపారు. ప్రభుత్వం పంటనష్టపోయిన రైతులను ఆదుకొని నష్టపరిహారం ఎకరాకు 50వేలు ఇప్పించాలని అక్రమ చెరువులను తొలగించి న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో భూషణ్, సంజీవ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**చీమన్‌పల్లిలోగల వసతిగృహాన్ని మార్చాలి**

చీమన్‌పల్లిలోగల హాస్టల్‌ను కొత్త బిల్డింగ్‌కు మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆగస్టు నుంచి మారుస్తామని చెబుతున్నా ఇప్పటివరకు మార్చలేదని అన్నారు. అన్నివిధాల అనుమతులు ఉన్నాగానీ ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్ల మార్చడం లేదన్నారు. గ్రామస్తులు అడ్డం వస్తున్నారని చెప్పి బిల్డింగ్‌ను మార్చడం లేదని అన్నారు. వెంటనే కొత్త బిల్డింగ్‌లోకి మార్చి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూమేశ్వర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## మోగిన స్థానిక సంస్థల నగారా

(5వ పేజీ తరువాయి...)

స్వీకరించనున్నారు. అక్టోబరు 16న నామినేషన్ల పరిశీలన, అక్టోబరు 19న నామినేషన్ల ఉపసంహరణ, అక్టోబరు 27న పోలింగ్ జరుగనుంది. రెండు విడతలకు సంబంధించి నవంబరు 11న ఓట్లలెక్కింపు జరుగనుంది.

**సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల షెడ్యూల్**

గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి మొదటి విడత నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 17 నుంచి 19 వరకు జరుగనుంది. అక్టోబరు 20న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 23 వరకు నామినేషన్ల ఉపసంహరణ, అక్టోబర్ 31న పోలింగ్, అదే రోజున ఫలితాలు విడుదల కానున్నాయి. రెండోవిడత గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 21 నుంచి 23 వరకు, పరిశీలన అక్టోబరు 24న, నామినేషన్ల ఉపసంహరణ అక్టోబరు 27వరకు, రెండోవిడత పోలింగ్ తేదీ నవంబర్ 4న అదే రోజు ఫలితాలు విడుదల కానున్నాయి.

**మొదటి విడత ఎన్నికలు జరిగే పరిషత్ స్థానాలు ఇవే..**

జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రెండువిడతల్లో నిర్వహించనున్నారు. మొదటి విడత 18 మండలాల్లో జడ్పీటీసీ, 177 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడతలో బోధన్ రెవెన్యూ డివిజన్‌లోని బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రేంజల్, రుద్రూర్, సాలూరా, వర్ని, ఎడపల్లి, నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నవీపేట్, నిజామాబాద్, సిరికొండ మండలాలలో అక్టోబర్ 23న ఎన్నికలు జరుగనున్నాయి. రెండో విడత 13 మండలాల్లో జడ్పీటీసీ, 130 ఎంపీటీసీ స్థానాలకు అక్టోబరు 27న ఎన్నికలు జరుగనున్నాయి. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లోని ఆలూర్, ఆర్మూర్, బాల్కొండ, భీంగల్, డొంకేశ్వర్, జక్రాన్‌పల్లి, కమ్మర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాలకు రెండవ విడతలో ఎన్నికలు నిర్వహించనున్నారు.

**రెండు విడుతల్లో సర్పంచ్, వార్డు ఎన్నికలు**

జిల్లాలో రెండు విడతల్లో గ్రామ పంచాయతీ, వార్డు మెంబర్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో బోధన్ రెవెన్యూ డివిజన్‌లోని 10 మండలాలతో పాటు నిజామాబాద్ డివిజన్‌లోని 5 మండలాలలో అక్టోబరు 31న పోలింగ్ నిర్వహించనున్నారు. మొదటి విడతలో 281 గ్రామ పంచాయతీలతో పాటు 2510 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. బోధన్ డివిజన్‌లోని బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రేంజల్, రుద్రూర్, సాలూరా, వర్ని, ఎడపల్లి, నిజామాబాద్ డివిజన్‌లోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్, నవీపేట్, నిజామాబాద్ మండలాలలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. రెండవ విడత పంచాయతీ ఎన్నికలు నవంబరు 4న ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లోని 13 మండలాలతో పాటు నిజామాబాద్ డివిజన్‌లోని 3 మండలాలలో మొత్తం 264 గ్రామ పంచాయతీలు, 2512 వార్డుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. రెండోవిడత ఎన్నికలు ఆర్మూర్ డివిజన్‌లోని ఆలూర్, ఆర్మూర్, బాల్కొండ, భీంగల్, డొంకేశ్వర్, జక్రాన్‌పల్లి, కమ్మర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్లతో పాటు నిజామాబాద్ డివిజన్‌లోని ధర్పల్లి, మాక్లూర్, సిరికొండ మండలాల్లో జరుగనున్నాయి.

## సరస్వతీ అలంకరణ రూపంలో దుర్గాదేవి

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవినవరాత్రి ఉత్సవాల్లో అతి ప్రాధాన్యమైన అవతారిణి సరస్వతి రూపంలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఆలయాల్లో, మండపాల్లో మూలనక్షత్రాన్ని పురస్కరించుకొని దుర్గామాతనుసరస్వతి రూ పంలో అలంకరించి ప్రత్యేక పూజ లు నిర్వహించారు.మండపాల్లో సా మూహిక అక్షరాభ్యాసంతో పాటు పుస్తకాలను పెట్టి పూజలు చేశారు. న్యాల్‌కల్ రోడ్‌లోని లలిత అమ్మవారిని సరస్వతి రూపంలో అలంకరించి ఆలయ అర్చకులు రాజేందర్‌శర్మ విశేష పూజలు జరిపారు.